క్లుప్తంగా

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ కిశోర్

రాయదుర్గంటౌన్: ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలియజేశారు. మంగళవారం పట్టణంలోని బీజీతిలక్ పాఠశాల, పాత మీ సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. ఆధార్ నమోదుపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ నెల 27 వరకు ఆధార్ నమోదు కేంద్రం కొనసాగుతుందన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ మంగళవారం పరిశీలించారు. తప్పులు లేకుండా ఆధార్ తీయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆధార్ క్యాంపులకు ప్రజల నుంచి స్పందన లభించింది. మంగళవారం కుందుర్పి, మలయనూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహించారు. .మొత్తం 290 మంది కేంద్రాలకు వచ్చి ఆధార్ మార్పులు, చేర్పులు చేసుకున్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ శేఖర్ పరిశీలించారు.

ఆయిల్‌ఫాం సాగుతో అనేక ప్రయోజనాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి నెట్టికంటయ్య

వజ్రకరూరు: ఆయిల్ ఫాం సాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని నియోజకవర్గ ఉద్యానశాఖ అధికారి నెట్టికంటయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పీసీ ప్యాపిలి గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఆయిల్ పామ్‌పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నెట్టికంటయ్య మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పంటసాగు చేసిన తర్వాత నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు జ్యోతిబాయి, సుదీప్‌కుమార్, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు సుమంత్‌రెడ్డి, రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ మస్తాన్ చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ ప్లీనరీ జిల్లా సమావేశాల పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు, తరిమెల గిరి, నాయకులు సోము, హిరణ్య మాట్లాడారు. భారత విద్యార్థి ఫెడరేషన్ అనంతపురం జిల్లా 32వ ప్లీనరీ సమావేశాలు ఆగస్టు 6,7 తేదీల్లో ఉరవకొండలో జరుగుతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని, విద్యార్థులను భావితర పౌరులు తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ ఉద్యమకారుడు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ పంథాలో పనిచేసి ప్రాణాలర్పించిన గొప్ప నేత చంద్రశేఖర్ ఆజాద్ నేటి యువతకు ఆదర్శనీయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి అంజి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్ తెలిపారు.

తహసీల్దార్ బదిలీ

గుమ్మఘట్ట: స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు వైఎస్సార్ కడప జిల్లాకు మంగళవారం బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జ్ బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు అప్పగించారు. ఈ స్థానంలో తహసీల్దార్‌ను ఎవరినీ నియమించలేదు.

అరక సాగలె..ఆశ చావలె

ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులైనా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అరక సాగడం లేదు. విత్తు పడటం లేదు. కారు మబ్బులు కమ్ముకొస్తున్నా చిరుజల్లులు చిలకరిస్తున్నాయి..తప్ప పదునైన వర్షం కురవలేదు. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. గోదావరి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు తదితర ప్రాంతాలల్లో వరద తాకిడి పెరిగి సాగు పంటలు తుడిచిపెట్టుకు పోయాయి. అయితే సీమ జిల్లాలో మాత్రం వరుణ కరువు స్పష్టంగా కనిపిస్తోంది.

– రాయదుర్గం:



రాయదుర్గం వద్ద వేరుశనగ సాగుకు సిద్ధం చేసిన పొలం

- అయోమయంలో రైతులు
- 20 శాతం కూడా దాటని ఖరీఫ్ సాగు
- వాయిగుండంతో మబ్బులు కమ్మినా కురవని వర్షం
- పంటలసాగుకు సిద్ధం చేసుకున్న పొలాలు పొడిబారిన వైనం
- పదును తేమ కోసం ఎదురుచూపు

రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	సాధారణ సాగు	సాగైన విస్తీర్ణం	శాతం
రాయదుర్గం	48,326	9,638	19
కళ్యాణదుర్గం	69,892	11,817	17
ఉరవకొండ	56,501	10,189	18

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ లో మరీ దారుణ పరిస్థితులను అన్నదాతలు ఎదుర్కొంటున్నారు. తుఫాను కారణంగా గత వారం నుంచి రోజంతా మబ్బులు కమ్ముకోవడం.. ఆపై ఎక్కడో ఒక చోట చిరుజల్లులు రాలడం.. ఆతర్వాత ఆవిరి కావడం కనిపిస్తోంది. పొలాల్లో నీరు నిలిచేలా కాకున్నా పదునైన వర్షం ఒక్కటీ ఇప్పటి వరకు కురవలేదు. మూడు నియోజకవర్గాల్లోనూ ఇప్పటి వరకు 1,74,179 హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా, 31,644 హెక్టార్ల లోనే విత్తు పడింది. అంటే కేవలం 18 శాతం మాత్రమే ఖరీఫ్ పంటలు సాగులోకి వచ్చాయి. వర్షపాతం లోటు ఏమేరకు ఉందో ఈ గణంకాలే సాక్ష్యం. ప్రధానంగా వేరుశనగ సాగు బాగా తగ్గింది. ఖరీఫ్‌లో ఈ పంటకే రైతులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కనీసం 10 శాతం దాటని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో సమకూర్చుకున్న విత్తనాలు కొందరు అమ్ముకోగా, మరి కొందరు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

ముందుకు సాగని సాగు..

ప్రకృతి అనుకూలించి, వర్షాలు కురిస్తే .. జూన్ నెల లోనే వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలు సాగులోకి వస్తాయి. ఈ ఏడాది జూలై ఆఖరికి కూడా ఎటు చూసినా పొలాలన్నీ బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. వర్షధారంగా కాకుండా కొందరు బోరుబావుల కింద వేరుశనగ విత్తారు. కంది, ఆముదం, మినుము, పెసర, జొన్న సాగు కూడా నామమాత్రంగానే ఉంది.

చినుకురాలని మండలాలెన్నో..

గతేడాది ఎల్‌నీనో ప్రభావంగా వర్షాలు కురవలేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయి కంటే భారీ వర్షాలు కురవచ్చని వాతావరణశాఖ ముందస్తుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతన్నలు దుక్కులు దున్ని విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. అయితే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో చినుకు పడని మండలాలెన్నో ఉన్నాయి. సాధారణం కంటే అతితక్కువ వర్షపాతం నమోదైంది. తుఫాను వెలరేగినా డీపైఎస్ఓ అధికారుల లెక్కలు చూస్తే.. రెండు ఎంఎం వర్షపాతం కూడా నమోదు కాని పరిస్థితి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖరీఫ్‌పై ఆశలు వదులుకోక తప్పదు.

ఆగస్టు 10 వరకు వేచి చూడొచ్చు..

లోటు వర్షపాతం కారణంగా ఖరీఫ్ పంటలు సాగడం లేదని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ లు తెలిపారు. అయితే రైతులు వేరుశనగ కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. వేరుశనగ తప్పనిసరి అయితే ఆగస్టు 10 వరకు విత్తుకోవచ్చన్నారు. రైతులు ఎవరూ తొందరపాటుగా విత్తనాలు అమ్ముకోవద్దని సూచించారు. కంది, ఆముదం, ఉలువ, పెసర, జొన్న పంటలు వేసుకోవడం మంచిదని తెలియజేశారు.

వర్షం కోసం ఎదురుచూపు

"ఐదెకరాల్లో వేరుశనగ విత్తనం సాగు చేసేందుకు పొలాలు దుక్కులు చేసుకొని సిద్ధం చేసుకున్నా. అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకున్నా. సరైన పదును వర్షం కోసం నెలరోజులుగా ఎదురుచూస్తున్నాను. వాయుగుండం కారణంగానైనా మూడు నాలుగు ఇంచులు నేల తడిచేలా వర్షం కురిసినా సాగు పూర్తిచేసే వాన్ని. ఈ నెలాఖరు వరకు చూసి విత్తనాలు అమ్ముకోక తప్పదు. ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగులోకి రాకపోతే రైతన్నలకు తీవ్ర నష్టం తప్పదు."

– హనుమంతరెడ్డి, రైతు, పూలకుంట

రైతు ఉత్పత్తిదారు సంఘాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా

బొమ్మనహాళ్: మండలంలోని ప్రగతి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఎకాలజీ విభాగం ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామంలోని ఎకాలజీ ఫీల్డ్ కార్యాలయంలో ప్రగతి రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ అధ్యక్షులు రాజేశ్వరి అధ్యక్షతన వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎఫ్‌టీఓ టీమ్‌లీడర్ శంకర్‌నాయక్, ఎఫ్‌టీఓ మేనేజర్ రమేష్, సీఈఓ హరీష్, ఏఎల్‌పీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళిక, నూతన సంఘాల సభ్యుల చేరిక, పంటల సాగు, విక్రయాలు, మార్కెటింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైతు సంఘం సభ్యుల ఆమోదంతో తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంటీఎల్ భవాని, హరి, ఎస్‌టోలు, సీఈఓలు, బీఓడీ సభ్యులు, రైతులు ,మహిళా రైతు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక భూమిని కాపాడండి

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామంలో శ్మశాన వాటికకు కేటాయించిన భూమిని కాపాడాలని ఆర్డీఓ రాణిసుస్మితకు బీజేపీ నాయకులు ముప్పూరి దేవరాజు గ్రామస్తులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు.

ప్రొటోకాల్ పాటించకుండా వివక్ష చూపుతారా ?

- ఎంపీడీఓ చాంబర్‌లో బైఠాయించి సర్పంచు నిరసన

వజ్రకరూరు: ప్రొటోకాల్ పాటించకుండా వివక్ష చూపి అవమానిస్తారా? అని వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల వైఖరిని నిరసిస్తూ సర్పంచు మోనాలిసా మంగళవారం నిరసన తెలియజేశారు. సర్పంచుకు స్థానిక పంచాయతీ వార్డు సభ్యుడు అచ్చనాల మధుసూదన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బెంజిమెన్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప తదితరులు మద్దతు తెలిపారు. సర్పంచు మోనాలిసా మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారన్నారు. అయితే సర్పంచు, వార్డు సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని ఎంపీడీఓ జరిపించారని అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు చేతిపంపుల మెటీరియల్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మీకాంతబాయి తదితరులను ఎంపీడీఓ పిలిపించి, మాట్లాడారు.



ఎంపీడీఓ చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచు మోనాలిసా తదితరులు

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోండి

మండలంలో ఎస్సీ,ఎస్టీ ప్రజాప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ ఐక్యవే దిక నాయకులు తహసీల్దార్ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో చాబాల సర్పంచు మల్లెల జగదీష్, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుప్రసాద్ , విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు రాము, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షతో అనేక ప్రయోజనాలు

కూడేరు: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందొచ్చని మండల వ్యవసాయాధికారి విజయ కుమార్ తెలిపారు. కమ్మూరు,తిమ్మాపురం, మరుట్ల, ఉదిరిపికొండ, పి.నారాయణపురం, ముద్దలాపురం సచివాలయాల పరిధిలో భూసార పరీక్షల్లో భాగంగా సేకరించిన మట్టి నమూనాలను వ్యవసాయాధికారులు మంగళవారం ల్యాబ్‌కు తరలించేందుకు సిద్ధం చేశారు. ఏఓ విజయ కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేల స్వభావం తెలుస్తుందన్నారు. భూమిలో ఉండే పోషకాలను తెలుసుకోవచ్చని, సాగు చేసిన పంటలకు తగ్గ రసాయన ఎరువును వాడుకోవచ్చన్నారు. ఇప్పేరు, అరవకూరు, కూడేరు, చోళసముద్రం, గొటుకూరు సచివాలయ పరిధిలోని భూముల్లో భూసార పరీక్షలు బుధవారం నుంచి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీహెచ్‌ఏలు సాజియా, రాజ్‌కుమార్, శ్రీలత, ఎంపీఈఓ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటల సాగు శ్రేయస్కరం

కుందుర్పి: ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులకనుగుణంగా మెట్టభూముల్లో బహుళ పంటలు సాగు శ్రేయస్కరమని ఏఓ మహేష్ తెలిపారు. మంగళవారం అప్పిలేపల్లి, నిజవళ్లి, మలయనూరు, మహంతపురం తదితర గ్రామాల్లో రైతులకు బహుళ పంటల సాగు, మట్టి నమూనా పరీక్షల వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు అపర్ణ, పాతన్న, గోపి, గణేష్, సిద్దప్ప, మౌనిక, రైతులు పాల్గొన్నారు.



కూడేరు: మట్టి నమూనాలను ల్యాబ్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న అధికారులు

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కంబదూరు: వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటలు సాగు చేయడంతో పాటు పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని మండల వ్యవసాయాధికారి జాఫర్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, రైతులు సాగు చేసిన వివిధ పంటను పరిశీలించారు. రైతులు తరచూ ఒకే పంటలను సాగు చేయకుండా పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. పంట సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వచ్చిన ఫలితాలఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. అలాగే పంటలకు ఆశించే తెగుళ్లపై అవగహన కలిగి నివారించుకోవాలని తెలిపారు.



అప్పిలేపల్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

గర్భిణులకు వైద్య పరీక్షలు

కుందుర్పి: మండలంలోని ఎస్.మల్లాపురం గ్రామంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అనూష, నారాయణస్వామి తదితరులు గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలు చేసి, మందులు అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

బొమ్మనహాళ్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బంగి ఉమాశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ యాదవులు తమ పిల్లలను బాగా చదివించి, ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రామరస్వామి, నాగరాజు, ఆవుల మనోహర్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక : యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరేసముద్రం రామకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, మల్లికార్జున, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, సొసైటీ నాగరాజు, సహాయ కార్యదర్శులుగా వన్నూరుస్వామి, హనుమంతరాయుడు, భీమప్ప, కోశాధికారిగా చంద్ర, ఉప కోశాధికారిగా ఉలెప్ప, ఎర్రిస్వామి, ప్రచార కార్యదర్శులుగా శ్రీధర్, సిద్దా, నరసింహ, కమిటీ సభ్యులుగా గురుమూర్తి, బొమ్మనహాళ్ ప్రకాష్, నాగేంద్ర, ఆంజనేయ, వీరేష్, రుద్రప్ప, నాగప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



నూతనంగా ఎంపికైన యాదవ సంఘం సభ్యులు

మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

వజ్రకరూరు: మొక్కలు పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ రమావత్ దేవి,ఎంపీడీఓ విజయలలిత తదితరులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల ఆవరణంతోపాటు క్రీడామైదానంలో కానుగ, నారేటి తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, బీట్ అధికారి సతీష్,హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను బాధ్యతగా పెంచుదాం

గుమ్మఘట్ట: మొక్కలను బాధ్యతగా పెంచుదామని ఎంపీడీఓ గౌరిదేవి తెలిపారు. మండలంలోని కె.పిదొడ్డి గ్రామ పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్త మానవాళికి చెట్లే జీవనాధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే అవి మనల్ని కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేశ్, ఈసీ అంజన్‌కుమార్, టీఏలు కృపాల్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు

పర్యావరణాన్ని కాపాడుదాం

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశులు పిలుపునిచ్చారు.మంగళవారం వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కాడీపీర్ల సరిగెత్తు



కురాకులగుట్ట ఆంజనేయస్వామి,హుస్సేన్ పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లచావిడిల్లో ఏడో రోజు సరిగెత్తు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కురాగులగుట్ట ఆంజనేయ స్వామి హస్సేన్, హుస్సేన్ పీర్లమకాన్, జేఆర్ఎస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, చర్చి ఏరియా, మధుటాకీస్ ఏరియా, పాటిల్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, కూరగాయల మార్కెట్, మొలకాల్మూరు రోడ్డు తదితర ప్రాంతాల్లోని పీర్ల చావిడిల్లో పీర్లను ప్రతిష్ఠించారు. మంగళవారం పీర్ల చావిడిల్లో ప్రత్యేక ఫాతెహా నిర్వహించి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. 25న పెద్ద సరిగెత్తు, పానకాల సమర్పణ, 26న పీర్ల ఊరేగింపు, జలధి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

- పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు



ఉరవకొండ: ఉపాధిహామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉరవకొండ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేశులు మంగళవారం తెలిపారు. ప్రభుత్వం పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఉరవకొండ డివిజన్‌లో మండలానికి 50 చొప్పున మొత్తం 750 యూనిట్ల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రైతులు, సంచార జాతులు, పీఎంఏవై లబ్ధిదారులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన రైతులు, ఒంటరి మహిళలు, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, స్థల హక్కు పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం జత పరిచి ఉరవకొండ ఏడీ కార్యాలయం అందించాలన్నారు.

గోకులాల నిర్మాణాలకు సంబంధించి యూనిట్ విలువ

పశువులకు	యూనిట్‌ధర (రూ.లక్షల్లో)	రాయితీ (రూ.లక్షల్లో)	రైతు చెల్లించేది (రూ.లక్షల్లో)
2 పశువులకు	1,15,000	1,03,500	11,500
4 పశువులకు	1,85,000	1,66,500	18,500
6 పశువులుదాటితే	2,30,000	2,07,500	23,000

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు సంబంధించి

షెడ్లు	యూనిట్‌ధర (రూ.లక్షల్లో)	రాయితీ ధర (రూ.లక్షల్లో)	రైతు చెల్లించేది (రూ.లక్షల్లో)
20 గొర్రెలు,మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు,మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లకు	87,000	60,900	26,100
200 కోళ్లకు	1,32,000	92,000	39,600

సంక్షిప్త సమాచారం

అతిసారం మరణాలను నివారించడమే లక్ష్యం

వజ్రకరూరు: పసిపిల్లల్లో అతిసారం మరణాలను నివారించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారి తేజశ్వి పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రకరూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్టార్ సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పసిపిల్లల్లో అతిసారం మరణాలను నివారించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్ , సుశీలమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ, హెల్త్‌అసిస్టెంట్ బాబావలి, ఏఎన్ఎం లు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

టీకాతో ముద్ద చర్మవాధికి చెక్

కూడేరు: ముందస్తుగా పశువులకు టీకాలు వేయించడం ద్వారా ముద్ద చర్మవాధి (ఎల్ఎస్‌డీ) బారినపడకుండా అరికట్టొచ్చని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని ముద్దలాపురంలో పశువులకు ముద్ద చర్మవాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ముద్ద చర్మవ్యాధి అధికంగా గోజాతి పశువులకు, తక్కువగా గేదెలుకు వస్తుందని పశువైద్యాధికారి తెలిపారు. అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు(ఏహెచ్ఏ) రాఘవయ్య, రఘువర్ధన్, యశోద, గోపాల మిత్రలు రామాంజనేయులు, తిరుపాలు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలతో జాగ్రత్త

సెట్టూరు: ఎర్రని రాగి రంగులో ఉండే స్పర్శలేని మచ్చలతో జాగ్రత్తగా ఉండాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని యాటకల్లు గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌ను ఆయన పరిశీలించారు. కుష్టువ్యాధి నిర్మూలపై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు నెల 2 వరకు కుష్టువ్యాధి బాధితులను గుర్తించేందుకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ కుమార్, హెచ్ఈఓ సత్యనారాయణ, ఆంజనేయులు, పీహెచ్‌ఎన్ సరోజమ్మ, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ఎంఎల్‌హెచ్‌పీ నమ్రత, ఏఎన్ఎం ఉమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

సెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లిలో వీధిదీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం సర్పంచ్ కళావతి పంచాయతీలోని బచ్చేహళ్లి, అడవిగొల్లపల్లి గ్రామంలోని వీధుల్లో పర్యటించి, వీధి లైట్లను ఏర్పాటు చేయించారు.

యువకుడి అదృశ్యం



ఈడిగ తిమ్మరాజు (ఫైల్)

సెట్టూరు: మండల కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఈడిగ తిమ్మరాజు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం తాళ్లకెరకు చెందిన ఈడిగ తిమ్మరాజు సెట్టూరు మండల కేంద్రంలో ఆరేళ్లుగా ప్రైవేట్ రక్తపరీక్షల కేంద్రం(ల్యాబ్) నిర్వహిస్తున్నాడు. ఈనెల 21న ల్యాబ్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ లభించకపోవడంతో తిమ్మరాజు సోదరుడు దేవరాజు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రాంభూపాల్ దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ లభిస్తే సెల్: 9346917104లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.